మరో నాలుగుచోట్ల బరిలోకి

- హుజురాబాద్ మల్లు లక్ష్మి.. నల్లగొండ ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి
- 17 నియోజకవర్గాల్లో కోదాడ ఒకటి పెండింగ్
- మునుగోడు, ఇల్లెందులో పోటీకి పరిశీలిస్తున్నాం
- కొల్లాపూర్ నుంచి పోటీపైనా చర్చలు
- నిర్దిష్ట ప్రతిపాదన లేకుండా పొత్తులు కుదరవు
- బాధిత, పీడితుల సమస్యలపై నిలదీసేది కమ్యూనిస్టులే
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎం పోటీ చేస్తానన్న 17 నియోజకవర్గాల్లోనే కాక మరో నాలుగు చోట్ల బరిలోకి దిగడానికి సిద్ధమవుతున్నామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పాలేరు నియోజకవర్గ అభ్యర్థి తమ్మినేని వీరభద్రం స్పష్టంచేశారు. ఇప్పటికే 14 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించామని, మరో ఇద్దరు అభ్యర్థులు ఖరారయ్యారనితెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం కోడలు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి హుజురాబాద్, సిపిఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి నల్లగొండ స్థానం నుంచి బరిలో ఉంటారని చెప్పారు. మరో స్థానం కోదాడ అభ్యర్థిని మంగళవారం మధ్యాహ్నంలోగా ప్రకటిస్తామన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సిపిఎం ప్రాతినిధ్యం వహించిన మునుగోడు, ఇల్లెందు, మహబూబ్‌నగర్ జిల్లా కొల్లపూర్ నియోజకవర్గం నుంచీ పోటీపై నాయకత్వం చర్చలు జరుపుతోందన్నారు. గతంలో తాము 17 స్థానాల్లోనే పోటీ చేస్తామని ప్రకటించామని, వాటిని 21 స్థానాలకు పెంచాలని నిర్ణయించామన్నారు. ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నామన్నారు. తెలుగుదేశం ఆవిర్భావానికి ముందు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 9 స్థానాలు గెలిచిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత కూడా ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ అధిక స్థానాలు గెలిచినా ఖమ్మంలో మాత్రం ఏడు నియోజకవర్గాల్లో కమ్యూనిస్టు అభ్యర్థులు గెలిచిన విషయాన్ని గుర్తు చేశారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు చేసేది కమ్యూనిస్టులే..

మిగిలిన పార్టీల్లా ఎన్నికలు, గెలుపు ఓటములతో నిమిత్తం లేకుండా కమ్యూనిస్టులు నిరంతరం ప్రజల సమస్యలపై పోరాడుతూనే ఉంటారని తమ్మినేని అన్నారు. ఖమ్మం జిల్లా సాగునీటి సమస్య పరిష్కారానికి... దుమ్ముగూడెం సాధన కోసం తాను 2,600 కిమీ పాదయాత్ర చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఉన్నా ఖమ్మం అసెంబ్లీ స్థానంలో స్నేహపూర్వక పోటీ ఉన్నట్టు తెలిపారు. సిపిఐ, టిడిపి కలిసి పోటీ చేసినా ఆ ఎన్నికల్లో తాను గెలుపొందిన విషయాన్ని ప్రస్తావిస్తూ... పోరాట ఫలితమే ఈ గెలుపు అన్నారు. ఆ తర్వాత రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తనను పక్కన పెట్టుకొని దుమ్ముగూడెం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన విషయాన్ని ప్రస్తావించారు. రూ.600 కోట్లు ప్రాజెక్టుకు కేటాయించినా నిధుల మంజూరు జాప్యం కావడంపైనా విపక్షాలతో కలిసి ఆందోళనలు నిర్వహించామన్నారు. ఆ తర్వాత ఆ ప్రాజెక్టు డిజైన్లు, పేర్లు మారినా..శంకుస్థాపనలు ఎవరు చేసినా మూలం కమ్యూనిస్టుల పట్టుదలే అన్నారు. జిల్లా సమస్యలు, కోల్‌బెల్ట్, విద్యావైద్యం, పోడుభూములు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసే చట్టాలపైనా మాట్లాడేది కేవలం కమ్యూనిస్టులేనని అన్నారు. అందుకే చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. బాధిత, పీడితుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేది కమ్యూనిస్టులేనని తెలిపారు.

పోడుహక్కు పత్రాలు, ఉపాధి బిల్లుల ఆమోదం వంటివి కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉండటం మూలంగానే సాధ్యమయ్యాయని తెలిపారు. కాబట్టి ఈ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించాల్సిందిగా పిలుపునిచ్చారు.

మూడు నినాదాలతో ముందుకు...

ఈ ఎన్నికల్లో మూడు నినాదాలతో ముందుకు వెళ్తున్నట్టు వీరభద్రం తెలిపారు. ఒకటి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలి, రెండోది సర్దుబాట్లు, సపోర్టు చేసే పార్టీలకూ ఓటేయాలి, మూడోది బిజెపి అభ్యర్థులను ఓడించాలనే నినాదాలతో ముందుకు వెళ్తున్నామన్నారు.

నిర్దిష్టమైన ప్రతిపాదన లేకుండా పొత్తులుండవు...

కాంగ్రెస్ వైపు నుంచి నిర్దిష్టమైన ప్రతిపాదన లేకుండా పొత్తులు కుదరవని సిఎల్‌పి నేత మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేసినట్టు తమ్మినేని చెప్పారు. ఆదివారం జానారెడ్డి, భట్టిఫోన్ చేశారని తమ్మినేని చెప్పారు. సోమవారం వంశీచందర్‌రెడ్డి ఫోన్ చేసి కొత్తగూడెంతో పాటు ఒక ఎమ్మెల్సీకి సిపిఐ అంగీకరించిందని, మీరూ అంగీకరించాల్సిందిగా కోరారన్నారు. పరిస్థితులు మారాయని, కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు బాధ్యతగా లేదన్నారు. పొత్తుల గురించి సిపిఎం బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల్లో వేటి వద్దకూ తాము వెళ్లలేదన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రాంతీయ పార్టీలు పుంజుకుంటున్నాయన్నారు. వామపక్షాలు పొత్తు ధర్మాన్ని పాటిస్తున్నాయన్నారు.

దొంగ ఓట్ల నమోదుపై వెంటనే చర్యలు తీసుకోవాలి

- ఇసికి తుమ్మల లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దొంగ ఓట్ల నమోదుపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఇసి) కోరారు. ఖమ్మం జిల్లాలో ఇంటి నంబర్లు లేకుండానే ఓట్లు నమోదు చేశారని ఇసి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఖమ్మం నియోజకవర్గాల వారీగా నమోదు చేసిన దొంగ ఓట్ల వివరాలతో కూడిన లేఖను తుమ్మల ఇసికి అందించారు.

ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 30 వేలకు పైగా ఓట్లను ఇంటి నంబర్లు లేకుండానే నమోదు చేసినట్లు చెప్పారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్, సిఇవో ఇతర ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ మేరకు గతంలో చేసిన తొమ్మిది ఫిర్యాదుల వివరాలనూ ఇసికి పంపిన లేఖకు తుమ్మల జత చేశారు. ఓట్ల జాబితా తుది ప్రకటన వెలువడనున్న నేపథ్యంలో దొంగ ఓట్లపై దృష్టి సారించాలని ఇసికి విజ్ఞప్తి చేశారు. ఇంటి నంబర్లు లేకుండా నమోదు చేసిన ఓట్లను వెంటనే తొలగించి.. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. జాబితా నుంచి దొంగ ఓట్లను తొలగించిన తర్వాతే తుది ప్రకటన విడుదల చేయాలని ఇసిని తుమ్మల కోరారు.

అజహరుద్దీన్‌కు ముందస్తు బెయిల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ క్రికెటర్ అజహరుద్దీన్‌కు మల్కాజిగిరి కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)కు చెందిన నిధుల్లో అవకతవకలకు పాల్పడ్డారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు ఉప్పల్ పిఎస్‌లో అజహరుద్దీన్‌తో పాటు మరికొంత మందిపై నాలుగు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ అజహరుద్దీన్ మల్కాజిగిరి కోర్టును ఆశ్రయించారు. ఉప్పల్ స్టేడియంలో జిమ్‌తో పాటు, బంతుల కొనుగోలు, కుర్చీల ఏర్పాటులో అక్రమాలకు పాల్పడ్డారంటూ నమోదైన కేసులో వాస్తవం లేదని అజహరుద్దీన్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం అజహరుద్దీన్‌కు 41ఎ నోటీసులిచ్చి ప్రశ్నించాలని ఉప్పల్ పోలీసులను ఆదేశించింది. అజహరుద్దీన్ ప్రస్తుతం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

రుణమాఫీ చేయకుండా మోసగించిన బిఆర్ఎస్ : జగ్గారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

2014 నుంచి రైతుల రుణమాఫీ చేస్తానని మోసగించిన బిఆర్ఎస్‌ను ఓడించాలని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రజలను కోరారు. సోమవారం గాంధీభవన్‌లో సంగారెడ్డి పార్టీ అభ్యర్థిగా ఆయన బీఫామ్ అందుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సోనియాగాంధీ ఒకేసారి మొత్తం రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సిఎం ఎవరనేది అధిష్టానం నిర్ణయిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ గెలుస్తోందని అర్థమైన బిఆర్ఎస్‌కు ఏమి చేయాలో అర్థం కాక మళ్లీ తెలంగాణవాదాన్ని తెరపైకి తెస్తోందని విమర్శించారు. 50 ప్రాజెక్టులను కాంగ్రెస్ నిర్మిస్తే, ఒక్క ప్రాజెక్టు నిర్మించిన బిఆర్ఎస్ ఆ ప్రాజెక్టు కూడా కుంగిపోయేలా నిర్మించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలను నివారించడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న వారి కుటుంబాలనూ ఆదుకోలేదని దుయ్యబట్టారు. ఎంఐఎం, బిఆర్ఎస్, బిజెపిలు ఒక్కటేనని, బిజెపి ఆడుతున్న ఆటలో బిఆర్ఎస్, ఎంఐఎం పావులని విమర్శించారు. బిజెపి ఎలాగూ గెలవదని బిఆర్ఎస్‌ను అడ్డుపెట్టుకుందని తెలిపారు. మైనార్టీల ఓట్లు కాంగ్రెస్‌కు పడకుండా ఎంఐఎం బిజెపికి సైనికునిగా మారిందని ఎద్దేవా చేశారు. మతాన్ని అడ్డం పెట్టుకుని పబ్బం గడుపుకుంటున్న ఎంఐఎంను నమ్మొద్దని ముస్లిములకు ఆయన సూచించారు. గత ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో పెట్టినవే అమలు చేయని బిఆర్ఎస్ మళ్లీ మ్యానిఫెస్టోలో హామీలెందుకని ఆయన ప్రశ్నించారు.

ఉమ్మడి ఆదిలాబాద్‌లో 15 నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నామినేషన్ల ప్రక్రియ భాగంగా సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 15 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదిలాబాద్ నియోజకవర్గంలో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. బిజెపి నుంచి పాయల శంకర్, యుగ తులసీ పార్టీ నుంచి సురేష్, స్వతంత్ర అభ్యర్థులుగా గైపెల్లి నాగన్న, సత్యనారాయణ నామినేషన్లు దాఖలు చేశారు. బోథ్ నుంచి బిఆర్ఎస్ అభ్యర్థిగా అనిల్ జాదవ్ నామినేషన్ వేశారు. ఖానాపూర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నేతావత్ రాజేందర్ నామినేషన్ వేశారు.

బెల్లంపల్లి నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా రాంటెంకి శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. మంచిర్యాలలో స్వతంత్ర అభ్యర్థులుగా గవ్వల శ్రీకాంత్, రంగు మల్లేశం, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ఎండి నయీంపాషా, నిర్మల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు నామినేషన్ వేశారు. ముధోల్ నుంచి బిజెపి అభ్యర్థి పవార్ రామారావు పటేల్ నామినేషన్ వేశారు. సిర్పూర్ (టి) నుంచి బిజెపి అభ్యర్థిగా పాల్వాయి హరీష్‌బాబు నామినేషన్ వేశారు. చెన్నూర్ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి జుమ్మిడి రాజేష్, స్వతంత్ర అభ్యర్థిగా చకినారపు కిరణ్ నామినేషన్లు వేశారు.

'లైంగిక వేధింపులకు గురైన విద్యార్థినికి న్యాయం చేయాలి'

- ఒయు ఇఫ్లూలో విద్యార్థుల ఆందోళన
- మద్దతు తెలిపిన విద్యార్థి సంఘాల నాయకులు, పలువురు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ఒయు సమీపంలోని ది ఇంగ్లీష్ అండ్ ఫారేన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. యూనివర్సిటీలో లైంగిక వేధింపుల బాధితురాలికి న్యాయం చేయాలని ఇఫ్లూ విద్యార్థులు యూనివర్సిటీ గేట్ నెంబర్ 2 వద్ద సోమవారం నిరవధిక దీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంగా ఇఫ్లూ విద్యార్థి సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ విసి రాజీనామా చేయాలని, ప్రోక్టర్ బోర్డ్‌ను రద్దు చేసి నూతన బోర్డును ఏర్పాటు చేయాలని, స్పర్శ్ కమిటీలో విద్యార్థినులకు చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. సదరు విద్యార్థినిపై లైంగిక వేధింపులు జరిగి ఇన్ని రోజులు అవుతున్నా నిందితులను ఎందుకు గుర్తించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల వైఫల్యంపై విద్యార్థులు ఉద్యమిస్తే వారిపై కేసులు నమోదు చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. విద్యార్థులు నినాదాలతో దీక్ష స్థలం మారుమోగింది. కాగా, విద్యార్థుల ఆందోళనకు ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణ జ్యోతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కెఎన్ ఆశలత, పిఒడబ్ల్యు సంధ్య, ప్రొఫెసర్ పద్మజ షా, కృష్ణ కుమారి మద్దతు తెలిపారు. అలాగే, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, ఉపాధ్యక్షులు అదం సృజన్ కుమార్, ఒయు అధ్యక్షులు మేడి శ్రీనివాస్ అక్కడకు చేరుకుని విద్యార్థులకు మద్దతు తెలిపారు. అయితే వీరిని, ఇఫ్లూ విద్యార్థులను ఒయు పోలీసులు అరెస్ట్ చేసి నల్లకుంట, అంబర్‌పేట పోలీస్ స్టేషన్లకు తరలించారు.

బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పాలి

- తెలంగాణలో బిజెపికి ఒక్క సీటూ రానివ్వం
- ఇబ్రహీంపట్నంలో సిపిఎంను గెలిపించాలి
- విస్తృతస్థాయి సమావేశంలో బివి రాఘవులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్‌ను ఓడించి, కమ్యూనిస్టులకు పట్టం కట్టాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో బిజెపికి ఒక్క సీటైనా రానివ్వబోమని, అన్ని స్థానాల్లోనూ అడ్డుకుంటామని ప్రకటించారు. మరోవైపు ఐదు రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల్లో ఇండియా వేదికలోని పార్టీలకు సీట్ల సర్దుబాటు విషయంలో కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. వామపక్షాలను గెలిపించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకుని తీరుతామని స్పష్టంచేశారు. 2024లో ఆయా రాష్ట్రాల్లోనే అనుకూలమైన శక్తులను ఇప్పటినుంచే పోగేసుకుంటుందన్నారు. ఎస్‌సి వర్గీకరణ పేరుతో మాదిగల ఓట్లు దండుకునేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి 2024లో అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యాన్ని సమాధి చేసి, నియంతృత్వాన్ని కొనసాగిస్తారని ఆందోళన వెలుగొచ్చారు. రాష్ట్రాల హక్కులు హరిస్తోందని, సామాజిక న్యాయాన్ని సర్వనాశనం చేస్తుందని దుయ్యబట్టారు. మునుగోడు ఎన్నికల అనంతరం బిజెపి ఆశలు సన్నగిల్లాయని, తెలంగాణలో దాని ప్రభావం తగ్గిందన్నారు. అయినా ఒకటి, రెండు సీట్లలో గెలిచే అవకాశాలున్నా అడ్డుకుని తీరుతామని చెప్పారు. అందుకే మునుగోడులో బిజెపిని అడ్డుకునేందుకే బిఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో బిజెపి బలహీనపడటానికి వామపక్షాలే కారణమని, బిఆర్ఎస్ కాదన్నారు. బిజెపి బెదిరింపులకు భయపడే కమ్యూనిస్టులతో తెగిదొంపులు చేస్తుకుందన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఒక్క సీటు లేకపోయినా ప్రాంతీయ పార్టీల ఎంపిలు బిజెపికి మద్దతు ఇచ్చే పరిస్థితి ఉందని గుర్తు చేశారు. కాంగ్రెస్ కూడా ఇదే కోవలోకి చేరిందన్నారు. తాము అధికారంలోకి వస్తే వామపక్షాలకు మంత్రులు, ఎమ్మెల్సీలు వంటి పదవులు ఇస్తామని చెప్తున్నారని, ఆ పదవులు ముఖ్యం కాదని ప్రజాక్షేత్రంలో నిలబడి తేల్చుకుంటామన్నారు. ప్రజలను సమీకరించి కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్‌లకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ప్రజా పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఉందని, ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేసి నిర్మించిన ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయేందుకు ప్రతి కార్యకర్త.. కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు.

సైన్యం నుంచి.. గెరిల్లా దళంలోకి..

- వీరతెలంగాణ పోరాట యోధుడు మంచికంటి
- పాలకుల ఆగ్రహాన్ని తట్టుకుని నిలబడిన రాంకిషన్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పీడిత ప్రజల విముక్తి కోసం వీరతెలంగాణా సమరాంగణంలో కొదమ సింహంలా విజృంభించి, చివరికంటా ప్రజా ఉద్యమ నిర్మాణంలో ఆణిముత్యమై మెరిసిన వ్యక్తి మంచికంటి రాంకిషన్‌రావు. ప్రజాపోరాటాన్ని అణచడానికి ఆనాటి పాలకులు ఎందరో యోధులతోపాటు మంచికంటిని కూడా జైల్లో పెట్టారు. చిత్రహింసలకు గురిచేసినా మొక్కవోని దీక్షతో ధైర్యంగా ఎదుర్కొన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రజల మనిషిగా తన గొంతును వినిపించారు.

కృష్ణాజిల్లా నందిగామ తాలూకా పెనుగంచిప్రోలులో రాంకిషన్‌రావు సాధారణ కుటుంబంలో జన్మించారు. తండ్రి పర్వా రామానుజరావు. తల్లి సీతమ్మ. రాంకిషన్‌రావుకు ఐదారేళ్ల వయసున్నప్పుడే తండ్రి చనిపోయారు. ఆయనకు ఓ అక్క, అన్న కూడా ఉన్నారు. పిల్లలు పెద్దవాళ్లయ్యే వరకూ వ్యవసాయం చేసుకొని ఫలసాయం అప్పుల కింద జమ చేసుకునేలా ఉన్న కొద్దిపాటి పొలాన్ని అప్పులవాళ్లకు అప్పగించి ఆ కుటుంబం ఖమ్మం వచ్చింది. వీరి కుటుంబ విషయం తెలిసి కాచిరాజుగూడెం భూస్వామి, పట్వారి అయిన మంచికంటి తిరుమలరావు రాంకిషన్‌రావును దత్తత చేసుకున్నారు. అప్పటి నుంచి రాంకిషన్‌రావు.. మంచికంటిగా మారారు. కాచిరాజుగూడెంలో ఇంటి వద్దనే ఉంటూ మూడో తరగతి వరకూ పూర్తి చేశారు. ఆ తరువాత పై చదువుల కోసం ఖమ్మంలో పెట్టారు. ఆరో తరగతిలో ఉండగానే రాంకిషన్‌రావుకు వివాహమైంది. ఆ తర్వాత రాంకిషన్‌రావు హైదరాబాద్ ల్యాండ్ రెవెన్యూ కార్యాలయంలో చిన్న ఉద్యోగంలో చేరారు. తర్వాత షోలాపూర్ వెళ్లి సైన్యంలో చేరారు. ఆ సమయంలో ఆంధ్ర మహాసభలో పనిచేస్తున్న జాతీయవాది కొమరగిరి నారాయణరావు, భార్య, తండ్రి సూచన మేరకు సైన్యం శిబిరం(పూణా) నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. కొన్నేళ్లపాటు అజ్ఞాతవాసంలో గడిపారు.

సుందరయ్య, మాకినేని, చంద్రతో పరిచయం..

కొణతమాత్మకూరులో ఉన్నప్పుడు కమ్యూనిస్టు అగ్రనేతలు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, చండ్ర రాజేశ్వరరావుతో మంచికంటి పరిచయం పెంచుకున్నారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా చేరారు. ఇదే ఆయన రాజకీయ జీవితానికి ఆరంభం. నిజాం నవాబుకు చెందిన రజాకార్లు, భూస్వామ్య శక్తులు.. ప్రజలపై చేస్తున్న దాడులను తిప్పికొట్టేందుకు ఆయన కృష్ణాజిల్లా కమ్మవారిపాలెంలో గెరిల్లా పోరాట యుద్ధ పద్ధతుల్లో శిక్షణ పొందారు. పిండిప్రోలులో దేశ్‌ముఖ్ జగన్నాధరెడ్డి దొర గడీని కూల్చివేసిన సంఘటనలో రాంకిషన్‌రావు పాల్గొన్నారు.

జైల్లో చిత్రహింసలు

నైజాం సంస్థానానికి సరిహద్దునగల కృష్ణాజిల్లా కమ్మవారిపాలెం, మల్కాపురం గ్రామాల్లో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మొదటి గెరిల్లా పోరాట శిక్షణ కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఆయుధాల కోసం పోలీసుస్టేషన్లపై దళాల దాడులకు మంచికటి నేతృత్వం వహించారు. తన రాజకీయ జీవితంలో అనేకసార్లు జైల్లో గడిపారు. వరంగల్ జైల్లో రేయింబవళ్లు కాళ్లూ చేతులకు బేడీలు వేయబడి శిక్ష అనుభవించారు. 1964లో సిపిఎం వైపు వచ్చిన ఆయన ప్రభుత్వ ఆగ్రహానికిగురై 16 నెలలపాటు జైలు శిక్ష అనుభవించారు. జైలులో ఉండగానే ఆయన జబ్బున పడ్డారు. 1974లో అధిక ధరలకు నిరసనగా నిర్వహించిన ఆందోళనలో మరో చిర్రావూరి లక్ష్మీనరసయ్యతోపాటు మంచికంటి అరెస్టయ్యారు. వారి పోరాట పటిమను అణచడానికి ఆనాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు వారిద్దరికీ బేడీలు వేయించి ఖమ్మం పురవీధుల్లో ఊరేగింపజేశారు. తర్వాత ఆ ఖమ్మం గడ్డపైనే చిర్రావూరి మున్సిపల్ చైర్మెన్‌గా, రాంకిషన్‌రావు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. 1975లో ఎమర్జెన్సీలోనూ రాంకిషన్‌రావును రాజమండ్రి, హైదరాబాద్, వరంగల్ కేంద్ర కారాగారాల్లో నిర్బంధించారు. మళ్లీ ఆయనకు అనారోగ్య పరిస్థితులు ఏర్పడటంతో వరంగల్ ఎంజిఎం ఆస్పత్రిలో చేర్చారు. ఆ స్థితిలో కూడా ఆయనను గొలుసులతో మంచానికి కట్టేసి హింసించారు.

సిపిఎంలో రాంకిషన్‌రావు ఎన్నో బాధ్యతలు నిర్వహించారు. 1982, 1985లో ఖమ్మం శాసనసభ్యునిగా ఎన్నికై శాసనసభలో ప్రజల వాణిని వినిపించారు. ఆ యోధుడు 1995 ఫిబ్రవరి 8వ తేదీన కన్నుమూశారు.

ఎన్నికల కమిషన్ అధికారికి నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న రేవంత్‌రెడ్డి

నాపై పోటీ చేయండి

- కెటిఆర్‌కు రేవంత్‌రెడ్డి సవాల్
- ఆరు గ్యారంటీలు అమలు జరగాలంటే కాంగ్రెస్ రావాలి
- వేలాదిమందితో ర్యాలీ, నామినేషన్ దాఖలు
- టిపిసిసి అధ్యక్షులు, కొండగల్ అభ్యర్థి రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొడంగల్‌ను అభివృద్ధి చేస్తే కెటిఆర్ తనపై పోటీ చేయాలని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ చరిత్రలో కొడంగల్‌కు మొదటిసారి మంచి అవకాశం వచ్చిందని, ఇదంతా కొడంగల్ ప్రజలు ఇచ్చిందేనని తెలిపారు. కొడంగల్‌కు కృష్ణా జలాలు, జూనియర్ కళాశాలలు, కంపెనీలు వస్తాయని, సిద్దిపేట, సిరిసిల్ల వలే ఈ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యేని గెలిపిస్తే ఏం చేశారని ప్రశ్నించారు. ఈ ప్రాంతానికి కృష్ణా జలాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, సిమెంటు ఫ్యాక్టరీలు, మహబూబ్ నగర్-చించోలి జాతీయ రహదారి పనులు పూర్తికాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని తీసుకువస్తే దాన్ని కలరాసారన్నారు, గొల్ల, కురుమ సోదరులు రూ.40 వేలు డీడీలు కట్టినా ఇప్పటికీ గొర్రెలు పంపిణీ చేయలేదని విమర్శించారు.

కొడంగల్ ప్రజలు ఓట్లు వేసి కెసిఆర్‌ను ఎంపిగా గెలిపించుకుంటే కొడంగల్ ప్రాంతానికి ఎందుకు న్యాయం చేయలేదన్నారు. కొడంగల్ బిడ్డలు ఏ ప్రాంతానికి వెళ్లినా కొడంగల్ అంటే కుర్చీ వేసి కూర్చోబెట్టే విధంగా కృషి చేస్తానన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించాలని, మీ బిడ్డగా వెళుతున్నానని, కొడంగల్ ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు.

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE AT ANEKAL
Misc. No.16 /2020 In O.S. No. 1033/2016

BETWEEN: Sri Sunil Dugar, S/o P. Uttamchand, aged about 52 years, R/at No. 2502, 8th F Main, 3rd Block, Jayanagar, Bangalore-560011. ... **PETITIONER**

AND: R1. Smt Muniyamma, W/o late Ramaiah, aged about 73 years, **R2. Sri Jagadish**, S/o late Narayana, aged about 30 years, **R3.Smt. Ramakka,** D/o late Narayana, aged about 26 years, **R4. Sri Raghavendra,** S/o late Narayana, aged about 24 years, **R5. Kum. Ramya,** D/o late Narayana, aged about 26 years, **R12. Smt. Devamma**, W/o late C. Muniyappa, aged about 82 years, **R13. Smt. Indravathi,** D/o late C. Muniyappa, aged about 54 years, **R14. Sri Ananda Kumar**, S/o late C. Muniyappa, aged about 52 years, **R15. Smt Yashoda,** W/o Ananda Kumar, aged about 49 years, **R16. Sri Madhuchandra,** S/o Sri Ananda Kumar, aged about 25 years, **R17. Sri Shivakumar,** S/o late C. Muniyappa, aged about 50 years, **R18. Sri Ramaiah,** S/o late Thoti Muniyappa, aged about 70 years, **R19. Smt Kamalamma,** W/o Sri Ramaiah, aged about 63 years, **R20. Sri Mariyappa,** S/o Sri Ramaiah, aged about 49 years, **R21. Smt Bhagya,** W/o Muniyappa, aged about 42 years, **R22. Smt Sujatha,** D/o Sri Ramaiah, aged about 42 years, **R23. Sri Muniramaiah,** S/o late Thoti Muniyappa, aged about 59 years, **R24. Smt Munirathnamma,** W/o Sri Muniramaiah, aged about 59 years, **R25. Sri Ramakrishna,** S/o Sri Muniramaiah, aged about 44 years, **R26 Smt. Saraswathi**, W/o Sri Ramakrishna, aged about 36 years, **R27. Sri. Deepak**, S/o Ramakrishna, aged about 18 years, **R28. Sri Srinivas,** S/o Sri Muniramaiah, aged about 52 years, **R29. Sri Muniraju .S,** S/o Sri Muniramaiah, aged about 38 years, **R30. Smt Dayanandamma,** W/o Sri Muniramaiah aged about 52 years. **R31:Smt Kavitha,** D/o Sri Muniramaiah, aged about 38 years, **R32. Sri Manjunath,** S/o Sri Muniramaiah, aged about 34 years, Nos.1 to 32 are R/at: Manchanahalli Village, Attibele Hobli, Anekal Taluk, Bangalore Urban District. **R33. Smt Ramakka**, D/o late Thoti Muniyappa, aged about 59 years, R/at Somasundara Palya, Begur Hobli, Bangalore South, Bangalore. **R35. M/s Iconica Projects,** A partnership firm, represented by Its partner: Mr. K.L. Santosh, Having its office at: Plot No. 55, Kauvri Hills Road, No. 36, Extended Jubilee Hills, Opposite to Water Tank, Above Yes Mart Building, Hyderabad Telangana-500033. ... **RESPONDENTS**

NOTICE TO RESPONDENT No.1 TO 5, 12 TO 33 AND 35. UNDER ORDER 5 RULE 20 (1)(A) OF CPC

WHEREAS the petitioner filed the above said petition against the respondents for the restoration of O.S. No. 1033/2016 in Misc. No.16/2020. You are hereby Notice to appear in this Hon'ble court in person or by an advocate duly instructed on **31-01-2024.** at 11:00 A.M. to answer the claim. Take notice that in default of your appearance on the day above mentioned the matter will be heard and decided in your absence as per law.

Given under my hand and seal of the court on 12-10-2023.

By order of the Court, Chief Ministerial Officer, Senior Civil Judge and JMFC Court, Anekal.

R. SHIVA KUMAR,
RSK LAW ASSOCIATES
No. 1. STB Complex, Attibele Road, Anekal, Bangalore Urban District -562106.

సి.పి.సి. ఆర్డరు 5 రూలు 1 మరియు 5 ప్రకారము
దావా సమను
కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No. 8 / 2018

తల్లపరెడ్డి బ్రహ్మారెడ్డి – వాది
Vs
తల్లపరెడ్డి సుబ్బమ్మ @ చిన సుబ్బమ్మ వగైరాలు – ప్రతివాది

To,
(D4) **శ్రీ తల్లపరెడ్డి నరసింహారెడ్డి,** తండ్రి **బ్రహ్మారెడ్డి,** నివాసము 1-4-19/1, సాయిప్రియ కాలనీ, కాప్రాటౌన్, అండ్ మునిసిపాలిటీ, హైదరాబాద్ సిటీ, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రము.

అయ్యా,
పై నంబరు దావాలో 3వ ప్రతివాది అగు **బొర్రా సుబ్బమ్మ @ మూలే సుబ్బమ్మ @ పెద సుబ్బమ్మ** గారు నీ పేరటకు **తేది: 21-07-2016** న వ్రాయించి ఇచ్చిన రిజిష్టర్ **సెటిల్‌మెంట్ పత్రము**ను రద్దు చేసి వాది తాలూకు హక్కును తీర్మాణము చేయమని పరిహారము కోరుచూ వాది నీ వగైరాల పైన పై దావా దాఖలు చేసియున్నాడు. సదరు దావా మీకు నోటీసు నిమిత్తము **తేది: 20-11-2023** న వాయిదా వేయబడి ఉన్నది. కనుక సదరు వాయిదారోజు **ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి యెదుట మీరు స్వయముగా గానీ మీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై పై దావా విషయమై మీకు గల ఆక్షేపణలను మరియు మీ తాలూకు వాదన సరియగు కౌంటర్ దావా మరియు దాని సంబంధిత రుజువు పత్రములు దాఖలు చేసుకొనవలసిందిగా ఆదేశించడమైనది. అట్లు తప్పి మీరు హాజరు కానియెడల పై దావా మీ పరోక్షమందు విమర్శ చేసి తీర్మానించబడును.

కె.రాజశేఖర్ రెడ్డి, బి.ఎ., ఎల్.ఎల్.బి.,
వాది ప్లీడరు, కందుకూరు.

IN THE COURT OF THE MACT CUM XI ADDL.CHIEF JUDGE: CITY CIVIL COURT, AT: HYDERBAD
O.P.No.757 OF 2021

BETWEEN :
Kyathapogu Jangamma & others. ...Petitioners
AND
Kavali Shivamcµii & others. ...Respondents.

To,
Kyathapogu Sumalatha W/ o. Late K.Ramesh, aged: 26 years, Occ: Housewife, R/o. 9-242, Vallabharaopalle Village, Nagarkurnool District. ...Respondent No.4.

Please take notice that the petitioners have filed the above O.P. against you and other respondents for claiming compensation for the death of the deceased Kyathapogu Yadaiah S/o Hanmaiah in a road accident which was occurred on 20/03/2020 at 02.30PM near Munnanoor sTage of NH-167 in the limits of P.S.Midjil, Mahaboobnagar district by Motor cycle bearing No. TS-06-EX-2264. The said O.P. is posted to 16.12.2023 at 10.30 AM for your appearance and counter. Kindly make it convenient to be present on the said date before this Hon'ble Court by 10.30 AM in person or through your counsel, failing which the matter will be decided on your absence.
Hence this notice.

BY ORDER OF THE COURT
M. VIJAY REDDY
ADVOCATE
2-2-647/A/58 Saibabanagar Shivam Road, Bagh Amberpet; Hyderabad,
Ph:7673904549, 9330489999.

మోసం చేసిన బిఆర్‌ఎస్‌ను సాగనంపండి

- పవన్ ఖేరా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరసగా రెండు సార్లు అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన బిఆర్ఎస్ పార్టీని సాగనంపాలని ఎఐసిసి మీడియా కమిటీ కన్వీనర్ పవన్ ఖేరా ప్రజలను కోరారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. పరీక్షల దరఖాస్తుల పేరుతో రూ.222 కోట్లు వసూలు చేసి ఒక్క పరీక్షను సక్రమంగా నిర్వహించలేదని విమర్శించారు. రాష్ట్రంలో 2020 సంవత్సరంలోనే 3,600 మంది యువత ఆత్మహత్య చేసుకున్న నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డ్ చెప్పిందని గుర్తుచేశారు.

నగరంలో 'స్టాన్ క్రియేటర్' ఫెస్ట్ ఏర్పాటు

హైదరాబాద్ : వేగంగా అభివృద్ధి చెందుతున్న గేమింగ్ స్టార్టప్ 'స్టాన్ గేమింగ్' క్రియేటర్ల విజయాలను పురస్కరించుకుని తొలిసారి హైదరాబాద్‌లో 'స్టాన్ క్రియేటర్ ఫెస్ట్'ను నిర్వహించింది. దీనికి దేశ వ్యాప్తంగా 500 కంటే ఎక్కువ మంది క్రియేటర్‌లు హాజరయ్యారని ఆ సంస్థ వెల్లడించింది. ఈ క్రియేటర్లు ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ మొదలైన వివిధ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లలో 30 కోట్లకు పైగా సామూహిక అనుచరులను కలిగి ఉన్నారని పేర్కొంది. దేశంలో 2025 నాటికి గేమింగ్ పరిశ్రమ 5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.45వేల కోట్లు)కు చేరుకోనుందని స్టాన్ సిఇఒ పార్త్ చద్దా, సిఒఒ నౌమా న్ ముల్లా అంచనా వేశారు. వర్ధమాన క్రియేటర్లకు తమ సంస్థ మద్దతు, ప్రోత్సాహాన్ని ఇవ్వనుందన్నారు.

విల్మర్‌లో అదాని వాటాల విక్రయం..!

న్యూఢిల్లీ : ఎఫ్ఎంసిజి ఉత్పత్తుల అదాని విల్మర్ నుంచి వైదొలగాలని ఆదాని గ్రూపు యోచిస్తోంది. ఇందుకోసం తన వాటాను విక్రయించేందుకు పలు అంతర్జాతీయ స్థాయి కంపెనీలతో చర్చలు జరుపుతుందని సోమవారం పలు రిపోర్ట్‌లు వచ్చాయి. అదాని విల్మర్ ప్రధానంగా ఫోర్చ్యూన్‌లో పలు రకాల వంట నూనెలు, పప్పులు, బియ్యం, చక్కెర తదితర అహార ఉత్పత్తులను విక్రయిస్తుంది. ఇకపై కేవలం కీలక రంగాల వ్యాపారాలపై మాత్రమే దృష్టి పెట్టాలని అదానీ గ్రూప్ నిర్ణయించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే సింగపూర్‌కు చెందిన 'విల్మర్ ఇంటర్నేషనల్' భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్‌ను వైదొలగాలని అదాని గ్రూప్ ఉంది. అదాని విల్మర్‌లో ఇరు సంస్థలకు 43.97 శాతం చొప్పున వాటాలున్నాయి. ఈ నెల చివరి కల్లా విక్రయంపై స్పష్టత రానుందని సమాచారం.

సిఎస్‌సిలో రెడ్ బస్ ఒప్పందం

హైదరాబాద్ : ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ సొల్యూషన్ యాప్ రెడ్ బస్ ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా తమ సంస్థ కనెక్టివిటీని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. అందులో భాగంగా విలేజ్ లెవెల్ ఎంటర్‌ప్రెన్యూర్‌లను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా వీరు దాదాపు 30వేలకు పైగా ఏజెంట్లు ఉన్నారని తెలిపింది. వీరు డిజిటల్ సేవా పోర్టల్‌లోని కామన్ సర్వీస్ సెంటర్‌ల (సిఎస్‌సి) సహకారంతో పని చేస్తున్నారని వెల్లడించింది. ఈ క్రమంలోనే రెడ్ బస్ సిఎస్‌సితో భాగస్వామ్యం కుదుర్చుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనూ స్థిరమైన వృద్ధిని సాధించాలని యోచించామని ఆ సంస్థ పేర్కొంది.

బంగారం కొనుగోళ్లపై ఫోన్‌పే క్యాష్ బ్యాక్ ఆఫర్లు

న్యూఢిల్లీ : దీపావళి పండుగ సీజన్ సందర్భంగా 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన బంగారంపై క్యాష్‌బ్యాక్ ఆఫర్లను అందిస్తున్నట్లు ఫోన్ పే తెలిపింది. తమ యాప్ ద్వారా రూ.1000 విలువ పైబడిన డిజిటల్ బంగారం కొనుగోలు చేసే వినియోగదారులు రూ.3000 వరకు గ్యారంటీ క్యాష్‌బ్యాక్ అందుకోవచ్చు. ఈ ఆఫర్ నవంబర్ 9-12 మధ్య అందుబాటులో ఉంటుందని పేర్కొంది. వినియోగదారులు ఏ సమయంలో అయినా తమ బంగారాన్ని విక్రయించుకోవచ్చు. ఆ విక్రయం ద్వారా అందే సొమ్ము 48 గంటల్లో వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేయబడుతుందని పేర్కొంది.

Sunrest
Lifescience Limited

పబ్లిక్ ఇష్యూకు సన్‌రెస్ట్ లైఫ్ సైన్స్

అహ్మదాబాద్ : ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్‌కు వెళ్లుతున్నట్లు సన్‌రెస్ట్ లైఫ్ సైన్స్ లిమిటెడ్ ప్రకటించింది. ఈ ఇష్యూతో రూ.10.85 కోట్ల నిధుల సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. దీనికి సంబంధించిన ఐపిఒ నవంబర్ 7న ప్రారంభమై 9న ముగుస్తుందని పేర్కొంది. కంపెనీ రూ.10 ముఖ విలువ కలిగిన 12.91 లక్షల ఈక్విటీ షేర్లను ఒక్కో షేరుకు రూ.84 చొప్పున జారీ చేయనున్నట్లు తెలిపింది. అప్లికేషన్ కోసం కనీస లాట్ సైజ్ 1600 షేర్లకు బిడ్ చేయాల్సి (రూ.1.34 లక్షలు) ఉంటుందని వెల్లడించింది. సమీకరించిన నిధులను వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, సాధారణ కార్పొరేట్ ప్రయోజనం కోసం ఉపయోగించనున్నట్లు పేర్కొంది.

ప్రాజెక్టులతో పాలమూరు సస్యశ్యామలం

- పరిణితి చెందిన ప్రభుత్వంతోనే రాష్ట్రం పురోగతి
- పార్టీలు, అభ్యర్థుల చరిత్రను చూసి ఓటెయ్యండి
- పాలమూరును గంజి కేంద్రాల దుస్థితికి తెచ్చింది కాంగ్రెస్ పార్టీయే..
- ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా పాలమూరు సస్యశ్యామలం అయింది. పరిణితి చెందిన ప్రభుత్వాల ద్వారానే రాష్ట్రమైన, కేంద్రమైన అభివృద్ధి చెందుతుంది. 50 ఏళ్ల కాంగ్రెస్ పరిపాలనా తీరు వల్లనే జిల్లాలో గంజి కేంద్రాల ఏర్పాటు చేయడం జరిగింది" అని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్ర, గద్వాల, మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సిఎం కెసిఆర్ పాల్గొని మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో పాలమూరు దుస్థితిని ఏ రాజకీయ పార్టీ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యక్తి అంజయ్య సిఎం అయిన తర్వాతనే జూరాల ప్రాజెక్టుకు మోక్షం కలిగిందన్నారు. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన ఈ పదేండ్లలో కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేశామని తెలిపారు. కృష్ణ, తుంగభద్ర ప్రధాన నదుల మధ్యలో ఉన్న నడిగడ్డ ప్రాంతాన్ని సమైక్యరాష్ట్రంలో ఏనాడు పట్టించుకోలేదని, కానీ నేడు తుమ్మిళ్లగట్టు ఎత్తిపోతల పథకాల ద్వారా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. గద్వాల ప్రాంతంలో వాల్మీకి, బోయలు ఎక్కువగా ఉంటారని, అంధ్రాలో వారు ఎస్టీలని, ఇక్కడ మాత్రం బిసిలని, అందుకే మన రాష్ట్రంలోనూ వారిని ఎస్‌టిల్లో కలిపేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని, అయినా ఫలితం లేదని చెప్పారు. సమైక్య రాష్ట్రంలో పాలమూరును మరిచిపోయినప్పటికీ అక్కడి నాయకులు వస్తే గద్వాలలో వారికి మంగళహారతులతో స్వాగతం పలికారని గుర్తుచేశారు. రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని, మెడికల్ కళాశాలలు, నవోదయ పాఠశాలల వంటి విషయంలో వివక్ష కనబరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ తర్వాత రెండో మున్సిపాలిటీగా నారాయణపేట ఏర్పడిందన్నారు. నారాయణపేట, కొడంగల్, మక్తల్‌కు నీళ్లు ఇచ్చే కాల్వలను మంజూరు చేశారని, టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే కాల్వలను పూర్తి చేసుకుందామని తెలిపారు. రైతుబంధు, 24 గంటల విద్యుత్తు, ధరణి వంటి ప్రజా పథకాలను రద్దుచేస్తామన్న కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో విసిరేయాలని పిలుపునిచ్చారు. కరివెన రిజర్వాయర్ పనులు పూర్తి కావొచ్చాయని, అందుబాటులోకి వస్తే దేవరకద్ర నియోజకవర్గంలో మొత్తం 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పాలమూరు- రంగా రెడ్డి పథకం అడ్డంకులన్నీ తొలగిపోతున్నాయని తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఏం జరిగిందో మీ కండ్ల ముందే ఉందని, ఆ అభివృద్ధిని చూసి బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎలక్షన్లు వస్తాయి.. పోతాయి.. కానీ మీరు వేసే ఓటు మీ ఐదేండ్ల భవిష్యత్తును నిర్ణయిస్తుందని, మీ తలరాతను మార్చేస్తుందని స్పష్టంచేశారు. అభ్యర్థులను ఎంపిక విషయంలో గాబరా కావద్దని, వజ్రాయుధం లాంటి ఓటును ఉపయోగించి మంచి సేవకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. సభల్లో మంత్రులు శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, ఎంపి మన్నె శ్రీనివాస్ రెడ్డి, జడ్‌పి చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి, పి చంద్రశేఖర్, మాజీ ఎంపిలు రావుల చంద్రశేఖర్ రెడ్డి, జగన్నాథం, ఎంపి రాములు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మాకు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలంగాణ గిరిజన సంఘం నాయకులు

ధర్మా మరణం గిరిజన ఉద్యమానికి తీరని లోటు

- తెలంగాణ గిరిజన సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన సంఘం వ్యవస్థాపకుల్లో ఒకరైన గుగులోత్ ధర్మానాయక్ అకాల మరణం గిరిజన ఉద్యమాలకు తీరనిలోటని, ఆయన మృతికి పలువురు సంతాపాన్ని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మ నాయక్ అధ్యక్షతన సంతాప సభను నిర్వహించారు. ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్ వినయ్‌కుమార్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోబన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ , సోషల్ మీడియా రాష్ట్ర బాధ్యులు జగదీష్, రజిత, గిరిజన సంఘం నాయకులు ఆర్ పాండు, గోపి నాయక్, గోరియానాయక్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ శ్రీరాం నాయక్ మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం తుది శ్వాస వరకు రాజీ లేని పోరాటాలు నిర్వహించారన్నారు. ఆయన గత ఐదేళ్లుగా క్యాన్సర్ మహమ్మారితో బాధపడుతున్నారని తెలిపారు. మధ్యలో కోలుకున్నారని, అనేక గిరిజన ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. చివరిసారిగా మిర్యాలగూడలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో పాల్గొని యువతకు స్ఫూర్తినిచ్చారని గుర్తు చేశారు. పోడు భూముల ఉద్యమంలో కొత్తగూడెం ప్రాంతంలో గిరిజనులకు అండగా నిలిచారని తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి హైదరాబాదులోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో మృతి చెందారని తెలిపారు

50 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్టు, రూ.30 వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఎస్‌పి బికె రాహుల్ హెగ్డే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రూ.12లక్షల విలువైన 50 కిలోల గంజాయిని కోదాడ పట్టణంలోని రామాపురం అంత్రరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నామని సూర్యాపేట జిల్లా ఎస్‌పి రాహుల్‌హెగ్డే తెలిపారు. సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం గంజాయి పట్టివేతకు సంబంధించిన వివరాలను ఎస్‌పి విలేకరులకు వెల్లడించారు. కోదాడ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీల్లో భాగంగా రామాపురం క్రాస్‌రోడ్డులోని నల్లబండగూడెం వద్ద అంత్రరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ఆంధ్రా నుంచి హైదరాబాద్ వెళుతున్న ప్రయివేటు బస్సులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గుర్ని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు.. మహారాష్ట్రలోని రాయగడ్ జిల్లాలో పళ్లు అమ్ముకునే అవదేశ్ చంద్రశేఖర్ వర్మ, అదే ప్రాంతానికి చెందిన మహిళలు శైల ప్రదీప్ దండకర్, సారిక విలాస్ మోహితే.. ఈ నెల మూడున మహారాష్ట్ర నుంచి రైలులో విశాఖపట్నం వెళ్లి శివారు ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్న వారి నుంచి రూ.లక్షకు 50 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ఆ గంజాయిని 12 ప్యాకులుగా చేయించి నాలుగు లగేజ్ బ్యాగుల్లో సర్దుకుని విశాఖపట్నం నుంచి బిఎంసిసి ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరారు. అక్కడి నుంచి మహారాష్ట్రకు వెళ్లి ఎక్కువ ధరకు గంజాయిని అమ్ముకోవాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌కు వస్తూ మార్గమధ్యలో చెక్‌పోస్ట్ తనిఖీల్లో పట్టుబడ్డారు. పోలీసులు వారి వద్ద నుంచి 50కిలోల గంజాయి, రూ.30వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కోదాడ డిఎస్‌పి ప్రకాష్, సిఐ రామకృష్ణారెడ్డి, రూరల్ ఎస్ఐ సాయిప్రశాంత్, హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కె.అబ్దుల్ సమద్‌ను ఎస్‌పి అభినందించారు.

కాంగ్రెస్‌కు మూకుమ్మడి రాజీనామాలు

- కంటతడి పెట్టిన ఆదిలాబాద్ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్
- ఇండిపెండెంట్‌గా పోటీకి సిద్ధం
- చెన్నూర్‌లో పార్టీని వీడిన బోడ జనార్ధన్, డాక్టర్ రాజారమేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి మంటలు చల్లారడం లేదు. ఆదిలాబాద్, చెన్నూర్ నియోజకవర్గాల్లో ఆ పార్టీ సీనియర్ నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. ఆదిలాబాద్ పార్టీ జిల్లా అధ్యక్షులు సాజిద్‌ఖాన్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడారు. ఈ సందర్భంగా సోమవారం మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మా ముగ్గురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పని చేస్తామని అధిష్టానానికి మొదటి నుంచి చెబుతూ వచ్చామని, కానీ అధిష్టానం తమని కాదని కంది శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఖరారు చేయడంతో రాజీనామా చేశామని తెలిపారు. వీరితో పాటు ఒబిసి జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్ అంబకంటి అశోక్, కెఆర్‌కె కౌన్సిలర్ రేష్మ ముబారక్, ఆదిలాబాద్ మండల బిసి సెల్ అధ్యక్షులు వెంకటి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు సుమారుగా 30 నుంచి 35 మంది వరకు మూకుమ్మడి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్టీ జిల్లా అధ్యక్షులు సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ.. జీవితం మొత్తం పార్టీకి అంకితం చేశానని, కాంగ్రెస్ పార్టీతో తనకున్న 20ఏళ్ల అనుబంధాన్ని తెంచుకుంటున్నానని చెప్పడానికి కూడా నోరు రావడం లేదంటూ కంటతడి పెట్టుకున్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని నమ్ముతానని చెప్పిన వ్యక్తికి టికెట్ కేటాయించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్ రాకున్నా ఇండిపెండెంట్‌గా బరిలో ఉండి గెలిచాక మళ్లీ కాంగ్రెస్‌లో చేరుతామని తెలిపారు. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా సంజీవ్‌రెడ్డిని నిలపాలని నిర్ణయం తీసుకున్నామన్నారు.

బిఆర్ఎస్‌లో చేరుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోడ జనార్ధన్

చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోడ జనార్ధన్ పార్టీని వీడి బిఆర్ఎస్‌లో చేరుతున్నట్టు ప్రకటించారు. పార్టీ బలోపేతం కోసం శ్రమించిన స్థానికులను కాదని స్థానికేతరులు, కార్పొరేట్ వ్యాపారస్తులు వివేక్ వెంకటస్వామికి టికెట్ కేటాయించినందుకు నిరసనగా పార్టీ సభ్యత్వానికి రాజీనామ చేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డికి పంపిస్తున్నట్టు చెప్పారు. మందమర్రి పర్యటనకు వస్తున్న పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరడంతో పాటు చెన్నూర్ అభ్యర్థి బాల్క సుమన్ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు.

పోలీసులపై చర్యలు తీసుకోండి

- ఇసికి కాంగ్రెస్ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గాంధీభవన్ నుంచి కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వాహనాలను, ప్రచార సామాగ్రిని పోలీసులు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారని టిపిసిసి ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. తీసుకెళ్లిన వాటిలో మూడు అంబాసిడర్ కార్లతో పాటు పలు రకాల ప్రచారసామాగ్రి ఉందని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మహారాష్ట్రలో బిఆర్ఎస్ బోణీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భండారా జిల్లాలో తొమ్మిది గ్రామ పంచాయతీలను బిఆర్ఎస్ గెలుచుకుంది. భండారా జిల్లాలోని 66 గ్రామ పంచాయతీలకుగాను 20 గ్రామ పంచాయతీల ఫలితాలు వచ్చాయి. భాండారాలో బిజెపి, కాంగ్రెస్, ఎన్‌సిపిలకు మద్దతుగా ఉండగా, తొమ్మిది గ్రామ పంచాయతీలపై బిఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేసింది. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటి వరకు రెండు గ్రామ పంచాయతీలను గెలుచుకున్నాయి. ఒక గ్రామ పంచాయతీలో ఎన్‌సిపి విజయం సాధించింది.

ఆభరణాల వర్తకంలో దక్షిణాదికి 60% వాటా

- 22వరకు జ్యువెలరీ షాపింగ్ ఫెస్టివల్
- జిజెసి ప్రతినిధుల వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

భారత్‌లో జరిగే మొత్తం అభరణాల వ్యాపారంలో దక్షిణాది వారే దాదాపు 60 శాతం వాటాతో ఆధిపత్యం కలిగి ఉన్నారని ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జిజెసి) ప్రతినిధులు పేర్కొన్నారు. మిగితా 40 శాతం ఉత్తర, ఈశాన్య రాష్ట్రాలు కలిగి ఉన్నాయన్నారు. మొత్తం జిడిపిలో ఈ రంగం ఏడు శాతం వాటా కలిగి ఉందన్నారు. భవిష్యత్తులో 7.5-8 శాతానికి పెరిగే అవకాశం ఉందన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇండియా జ్యువెల్లరీ షాపింగ్ ఫెస్టివల్ (ఐజెఎస్ఎఫ్) 2023 సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిజెసి డైరెక్టర్ దినేష్ జైన్, చైర్మన్ సయమ్ మెహ్రా, జాయింట్ కన్వీనర్ మనోజ్ జా మాట్లాడారు. సంస్థ బ్రాండ్ అంబాసిడర్ ప్రముఖ నటి శ్రుతి హాసన్ పాల్గొని సందడి చేశారు. ఈ షాపింగ్ ఫెస్టివల్ అక్టోబర్ 15న ప్రారంభమైన నవంబర్ 22 వరకు కొనసాగనుందని జిజెసి ప్రతినిధులు వెల్లడించారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ఆభరణాల ఎగ్జిబిషన్‌గా గుర్తింపు పొందిందని అన్నారు. ఇందులో దేశ వ్యాప్తంగా 1500 సంస్థలు భాగస్వామ్యం పొందాయని తెలిపారు. ఈ ఫెస్టివల్ వల్ల జువెలరీ రంగంలో వృద్ధి పెరిగి, అటు కార్మికులకు, వ్యాపారులకు ఎంతో లబ్ధి జరుగుతుందని పేర్కొన్నారు. నగల కొనుగోలును ప్రోత్సహించడానికి కొనుగోలుదారులకు ప్రతి రూ.25 వేల ఖరీదుపై ఒక కూపన్, పరిమితి సంఖ్యలో వెండి నాణేలు, పసిడి నాణేలు ఇస్తున్నామని తెలిపారు నమ్మకం, నాణ్యత కోసం ఐజెఎస్ఎఫ్ ఫెస్టివల్‌లో పాల్గొని ఆభరణాలు కొనుగోలు చేయాలని నటీ శ్రుతి హాసన్ కోరారు. తనకు హైదరాబాద్ అన్నా.. ఇక్కడి ప్రజలన్నా ఎనలేని గౌరవమని ఆమె తెలిపారు.

బలం లేకున్నా మెజార్టీ సీట్లు గెలుస్తాం

- ఈటల రాజేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 119కి గానూ అన్ని నియోజకవర్గాల్లో బలం లేకపోయినప్పటికీ తమ పార్టీనే అధిక స్థానాల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పరుస్తుందని బిజెపి ఎమ్మెల్యే, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్ ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఐజెయు జాతీయ కార్యదర్శి వై.నరేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ప్రధాన కార్యదర్శి విరావత్ అలీ అధ్యక్షతన నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో ఈటల మాట్లాడారు. నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వీక్‌గా ఉన్నా ఉత్తర తెలంగాణలో తమకే అధిక సీట్లు వస్తాయని నొక్కి చెప్పారు. ఒకవేళ తెలంగాణలో హంగ్ వస్తే కాంగ్రెస్, బిఆర్ఎస్ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని చెప్పారు. ఎంఐఎం, కాంగ్రెస్, టిఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్న చరిత్ర బిజెపికి ఎన్నడూ లేదన్నారు. ఆ మూడు పార్టీలే పరస్పరం ఎన్నికల్లో సహకరించుకుంటాయని చెప్పారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి మాదిరిగా సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్నారనీ, అభివృద్ధి పేరుతో హైదరాబాద్ చుట్టు పక్కల ఉన్న 5,800 ఎకరాల భూమిని అతి చౌక ధరలకు అమ్మేసిందని ఆరోపించారు. ఒక్క గజ్వేల్‌లోనే ఆయన బాధితులు 30 వేల మంది ఉన్నారనీ, ఆ బాధితుల సంఘానికి తననే అధ్యక్షులుగా ఉండాలని కోరారని చెప్పారు. వారంతా కలిసికట్టుగా కేసీఆర్‌ను ఓడించబోతున్నారన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామనీ, ఆ మూడింటిలోనూ కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

ఇలాంటి అవినీతి సర్కార్ ఎక్కడా లేదు

- బిజెపి రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని బిఆర్ఎస్ ప్రభుత్వం లాంటి అవినీతి సర్కారు దేశంలో ఎక్కడా లేదని బిజెపి రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, కుటుంబ పాలనపై చార్జిషీట్‌ను బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి, ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపి డాక్టర్ కె లక్ష్మణ్, చార్జిషీట్ కమిటీ చైర్మెన్, మధ్యప్రదేశ్ ఎన్నికల ఇన్‌చార్జి మురళీధర్‌రావు, తదితర నేతలతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జవదేకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల్ని గాలికొదిలేసిందని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వ పాలసీల వల్ల డ్రగ్స్, లిక్కర్ టెర్రరిజంకు చోటు దక్కిందన్నారు. ఇస్లామిక్ టెర్రరిజం మూలాలు తెలంగాణలో ఉన్నాయని చెప్పారు. మజ్లిస్ అండతో బంగ్లాదేశ్, బర్మా, రోహింగ్యాల సంఖ్య తెలంగాణలో రోజురోజుకీ పెరుగుతున్నదనీ, వారు స్లీపర్ సెల్స్‌గా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంఐఎం ఒత్తిడితో, పోలీసులు రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడితో పనిచేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ బాగుండేదని, ఇప్పుడు దాన్ని రాజకీయం చేశారని ఆరోపించారు. అధికార పార్టీ చెప్పినట్టు చేయకపోతే బదిలీల పేరుతో పోలీసులను వేధిస్తోందని విమర్శించారు. మురళీధర్‌రావు మాట్లాడుతూ తమది రైతు రాజ్యం అని చెబుతున్న బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో 7800 మందికిపైగా రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో అవినీతి లేనిదే ఏదీ జరగట్లేదని విమర్శించారు. బిఆర్ఎస్ అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.

అక్టోబర్‌లో తగ్గిన వాహన అమ్మకాలు

- ఎఫ్ఎడిఎ గణంకాల వెల్లడి
- పండుగ సీజన్‌లో డిమాండ్ కొరత

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థకు అద్దం పట్టే వాహన అమ్మకాల్లో పతనం చోటు చేసుకుంది. ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో వాహన విక్రయాలు 8 శాతం క్షీణించాయని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఎఫ్ఎడిఎ) సోమవారం వెల్లడించింది. ఈ ఏడాది అక్టోబర్‌లో 7.73 శాతం క్షీణించి 21,17,596 యూనిట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే నెలలో 22,95,099 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. గడిచిన నెలలో ద్విచక్ర వాహన విక్రయాల్లో తగ్గుదల వల్లే మొత్తం అమ్మకాలపై ప్రభావం చూపిందని ఎఫ్ఎడిఎ వెల్లడించింది. కాగా.. పండుగ సీజన్‌లో వాహన అమ్మకాలు పడిపోవడం ఆర్థిక వ్యవస్థలో ప్రతికూలతలకు నిదర్శనం. ముఖ్యంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబించే ద్విచక్ర వాహన అమ్మకాలు భారీగా పడిపోవడం ఆందోళనకరం. పండుగ సీజన్‌లో అమ్మకాలు పడిపోవడం వాహన పరిశ్రమను ఆందోళనకు గురి చేస్తుంది. వచ్చే నెలల్లో అమ్మకాలపై మరింత ఒత్తిడి ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.ఎఫ్ఎడిఎ రిపోర్ట్ ప్రకారం.. క్రితం అక్టోబర్‌లో దిచక్ర వాహన విక్రయాలు 12.60 శాతం క్షీణించి 15.07 లక్షల యూనిట్లకు తగ్గాయి. గతేడాది ఇదే నెలలో 17.25 లక్షల టూవీలర్ల అమ్మకాలు జరిగాయి. ప్రయాణికుల వాహన విక్రయాలు 1.35 శాతం తగ్గి 3,53,990 యూనిట్లుగా నమోదయ్యాయి. గతేడాది 3,58,884 యూనిట్ల విక్రయాలు జరి గాయి. మూడు చక్రాల వాహన అమ్మకాలు 45.63 శాతం పెరిగి 1,04,711 యూనిట్లుగా ఉన్నాయి. ట్రాక్టర్ల అమ్మకాలు 6.15 శాతం పెరిగి 62,440 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. వాణిజ్య వాహన రిటైల్ విక్రయాలు 10.26 శాతం పెరిగి 88,699 యూనిట్లకు చేరాయి. నవరాత్రి సమయంలో మాత్రం అమ్మకాలు మెరుగ్గా జరిగాయని.. స్థూలంగా అక్టోబర్‌లో తగ్గాయని ఎఫ్ఎడిఎ వెల్లడించింది.

ఎన్నికలు ఎక్కడైనా.. జెండా సిరిసిల్లదే..

- అన్ని రాజకీయ పార్టీల జెండాలు ఇక్కడే తయారీ
- నేత కార్మికులకు చేతినిండా పని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా సిరిసిల్ల జెండా ఎగరాల్సిందే. సిరిసిల్ల నేతన్నల నైపుణ్యాన్ని మెచ్చిన రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయి రాజకీయ పార్టీలు తమ ప్రచార జెండాలు, కండువాలు, ఇతర వస్త్ర సామాగ్రి ఆర్డర్లను సిరిసిల్ల నేతన్నలకు ఇస్తారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సిరిసిల్ల నేతన్నలకు మెండుగా ఉపాధి లభిస్తోంది. వివిధ పొలిటికల్ పార్టీల జెండాలు, కండువాలు సిరిసిల్లలో ఉత్పత్తి చేసేందుకు ఆర్డర్ వస్తున్నాయి. తమ పనితనంతో నేతలను మెప్పిస్తున్నారు.

తెల్లని వస్త్రాన్ని ఉత్పత్తి చేసి దానిపై వివిధ పార్టీల నాయకుల ఫొటోలు, గుర్తులు, పార్టీలకు సంబంధించిన కలర్స్‌తో పూర్తి స్థాయి జెండాలు, కండువాలు తయారవుతున్నాయి. అతి తక్కువ ధరలకే ఎన్నికల ప్రచార సామాగ్రిని సరఫరా చేస్తూ జాతీయ స్థాయి పార్టీల చూపు సిరిసిల్ల వైపు చూసేలా చేస్తున్నారు నేతన్నలు. ఇప్పటికే పలు పార్టీల నుంచి పెద్ద ఎత్తున ఆర్డర్లు వస్తుండటంతోపాటు వారికి కావాల్సిన ధరలో మన్నికతో అందిస్తున్నారు. అదే సమయంలో నేత కార్మికులకు ఎలక్షన్ సందడితో చేతినిండా పని దొరుకుతోంది.

తెలుగు రాష్ట్రాల నుంచి ఆర్డర్లు..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలకు చెందిన రాజకీయ పార్టీల ఆర్డర్‌లు సిరిసిల్ల నేతన్నలకు ఇప్పటికే అందాయి. అందుకనుగుణంగా ఉత్పత్తి ప్రారంభించారు. పార్టీ జెండా తయారీకి మీటరున్నర వస్త్రం, కండువా తయారీకి మీటర్ వస్త్రాన్ని వాడుతున్నారు. వివిధ పార్టీల ఆర్డర్‌లను బట్టి జెండాలను, కండువాలను తయారు చేస్తున్నారు. ఇప్పటికే బిఆర్ఎస్ ఐదు లక్షల మీటర్ల ఆర్డర్లు ఇచ్చింది. వైసిపి ఐదు లక్షల మీటర్ల ఆర్డర్లు ఇచ్చింది. మిగతా రాజకీయ పార్టీలూ ఆర్డర్లు ఇచ్చాయి. ప్రస్తుతానికి జెండాలు, కండువాలు తయారు చేస్తున్నారు. జెండారు తయారు చేసే నేతన్నలు రూ.తొమ్మిది చొప్పున మీటరు వస్త్రాన్ని కొనుగోలు చేస్తారు. దీనికి ప్రింటింగ్ కోసం రూ.ఎనిమిది ఖర్చవుతుంది. ఒక జెండా తయారీకి మొత్తం రూ.17 ఖర్చవుతుంది. ఉత్పత్తిదారులు ఈ జెండాలను రూ.19 నుంచి రూ.20కు విక్రయిస్తున్నారు.

నేత కార్మికులకు ఉపాధి..

ప్రస్తుతం జెండాల ఉత్పత్తిలో సిరిసిల్లలో దాదాపు 500 మంది నేత కార్మికులు ఉపాధి పొందుతున్నారు. జెండా కట్ చేస్తే ఒక్కో జెండాకు 25 పైసలు, కుట్టిస్తే 40 పైసల చొప్పున ఇస్తారు. జెండాల తయారీ కార్ఖానాలో స్థానికులు రోజూ ఉపాధి పొందుతున్నారు. ప్రతి ఎలక్షన్ టైంలో సిరిసిల్లలో పలు పార్టీల జెండాలను తయారు చేసేందుకు సిరిసిల్ల నేతన్నలకు ఆర్డర్లు ఇస్తారు.

అన్ని జిల్లాలకు సిరిసిల్ల నుంచే..

సిరిసిల్లలో తయారైన పార్టీల జెండాలను అన్ని జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. ఇతర జిల్లాలకు చెందిన ప్రింటింగ్ వ్యాపారులు ఎమ్మెల్యే అభ్యర్థుల ఆర్డర్లు తీసుకుని సిరిసిల్లలో ఇస్తుంటారు. ఇక్కడ జెండాలను తయారు చేయించుకుని ఎమ్మెల్యే అభ్యర్థులకు అందజేస్తారు. ఇలా మధ్యవర్తులతోనూ కొన్ని ఆర్డర్లు లభిస్తాయి.